తాగునీరు పుష్కలం



ముడసర్లోవ రిజర్వాయరు

నాడు

ఆరిలోవ ప్రాంతంలో తాగునీటి సమస్య ప్రధానంగా ఉండేది. ఎండాకాలం వచ్చిందంటే నీటి వనరులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో గుక్కెడు నీటికి ప్రజలు అవస్థలు పడేవారు. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో నీటి సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు

ఆరిలోవ ప్రాంతంలో తాగునీరు పుష్కలంగా లభిస్తోంది. ఎండాకాలంలో కూడా నీటి ఎద్దడి లేకుండా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కనీస మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇచ్చింది. తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపింది.

- ఆరిలోవలో నీటి సమస్యకు చెక్
- కుళాయిల ద్వారా సరఫరా

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ జోన్–2 పరిధిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో జోన్–2 పరిధికి సంబంధించిన ఐదు వార్డులున్నాయి. అవి తొమ్మిదో వార్డు నుంచి పదమూడో వార్డు వరకు ఉన్నాయి. ఆయా వార్డుల్లో అటు జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, డెయిరీఫారం, రవీంద్రనగర్ నుంచి ఇటూ తోటగరువు, దుర్గాబజార్, ఆరిలోవకాలనీ విశాఖ కేంద్ర కారాగారం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ వరకు, కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు ఉన్నాయి. ఆయా ప్రాంతాలలో ప్రజలకు నీటి సమస్య రాకుండా జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నిరంతర ప్రక్రియలో భాగంగా కొత్త కుళాయిలు ఇవ్వడం, అవసరమైనచోట కొత్తగా బోరింగులు వేస్తున్నారు. దీని పరిధిలో వేల సంఖ్యలో కుళాయిలు, వందల సంఖ్యలో బోరింగులు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా వార్డుల్లో పుష్కలంగా నీటి సరఫరా జరుగుతుంది.



పదో వార్డులో బోర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

13,338 కుళాయిలు, 706 బోర్లు

జీవీఎంసీ తొమ్మిది నుంచి పదమూడో వార్డు వరకు 13,338 కుళాయిలు, 706 బోరింగులున్నాయి. వాటిలో బిలో పావర్టీ లైన్ (బీపీఎల్) వారికి 8,446 కుళాయిలు, ఎబౌ పావర్టీ లైన్ (ఏపీఎల్) గలవారికి 4,653 మంది సొంత కుళాయిలు ఉన్నాయి. అందరికీ తాగునీరు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు 239 చోట్ల వీధి కుళాయిలు కూడా ఏర్పాటు చేశారు. వాటితో పాటు 706 చోట్ల బోరింగులు తీయించారు. వీటన్నింటితో పాటు రెండు ట్యాంకర్లు ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంకర్లు ద్వారా కొండవాలు ప్రాంతాలతో పాటు ఆరిలోవలో పలుచోట్ల, పైనాపిల్‌కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్ తదితర ప్రాంతాలకు నిరంతరం నీటి సరఫరా చేస్తున్నారు.

- వార్డులు వారిగా కుళాయిలు, బోర్లు..
- తొమ్మిదో వార్డులో 2,295 కుళాయిలు, 69 బోర్లు ఉన్నాయి. వాటిలో ఇటీవల ఈ వార్డులో కొత్తగా రెండు బోర్లు తీయించారు.
- పదో వార్డులో 2,291 కుళాయిలు, 89 బోర్లు ఉన్నాయి. వాటిలో ఇటీవల ఈ వార్డులో కొత్తగా రెండు బోర్లు తీయించారు.
- 11వ వార్డులో 2,861 కుళాయిలు, 192 బోర్లు ఉన్నాయి. వాటిలో గత ఏడాది ఈ వార్డులో కొత్తగా రెండు బోర్లు తీయించారు..
- 12వ వార్డులో 2,859 కుళాయిలు, 202 బోర్లు ఉన్నాయి. వాటిలో ఇటీవల ఈ వార్డులో కొత్తగా మూడు బోర్లు తీయించారు. ఇందులో ఒకటి వారం క్రితం తీయించినదే.
- 13 వార్డులో 3,077 కుళాయిలు, 154 బోరుల ఉన్నాయి. వాటిలో ఇటీవల ఈ వార్డులో రెండు బోర్లు కొత్తగా తీయించినవి..

	కుళాయిలు	బోర్లు
9వ వార్డులో	2,295	63
10 వార్డులో	2,291	89
11వ వార్డులో	2,861	192
12వ వార్డులో	202	192
13వ వార్డులో	3,077	154

నాలుగేళ్లలో వేసిన బోర్లు : 44

ఒక్కో బోరుకు ఖర్చు : రూ.లక్ష



ఇది కదా అభివృద్ధి



11వ వార్డులో బోరు

అందుబాటులో చేతి బోర్లు



కాలనీలలో బోరింగులు అందుబాటులో ఉన్నాయి. కుళాయిలు ద్వారా వడకట్టిన నీరు వస్తుంది. గతంలో అప్పుడప్పుడు నలకలతో నీరు వచ్చేది. ఇప్పుడు మాత్రం సరఫరా అవుతున్న నీరు బాగుంది. తాగు నీటికి ఇబ్బంది లేదు. కుళాయి నీరు రావడం ఆలస్యమైతే అవసరానికి బోరింగులు వద్ద నీరు పట్టుకోవడానికి వీలుగా ఉంది.

–లలిత, ఆరిలోవ,

నిరంతర చర్యలు



తూర్పు నియోజకవర్గం జోన్–2 పరిధిలో ఉన్న ఐదు వార్డులకు తాగు నీటి సమస్య లేకుండా నిరంతరం చర్యలు చేపడుతున్నాం. వడకట్టిన నీటిని కుళాయిలు ద్వారా సరఫరా చేస్తున్నాం. బీపీఎల్, ఏపీఎల్ వారికి వేర్వేరుగా రుసుంతో కుళాయిలు వేశాం. అవసరమైనచోట్ల పబ్లిక్ కుళాయిలు, బోరింగులు ఏర్పాటు చేశారు. అన్ని వార్డుల్లోను నీటి సరఫరా విషయంలో ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా సిబ్బంది వెంటనే వెళ్లి మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తున్నారు.

– అప్పాజీ, ముడసర్లోవ నీటి సరఫరా విభాగం ఏఈ

నీటి ఇబ్బందులు తప్పాయి



ప్రతి రోజూ కుళాయి నీరు వస్తోంది. సరిపడినంత వరకు పట్టుకొంటున్నాం. బ్లీచింగ్ కలిపి, శుభ్రం చేసిన నీరే వస్తోంది. గతంలో నీటి కోసం బాగా ఇబ్బందిపడేవాళ్లం. ప్రస్తుతం నీటి కోసం ఇబ్బందిలేదు.

–ఎ.అరుణ, గృహిణి, ఆరిలోవ

క్లుప్తంగా

క్రీడాకారిణికి రూ.25 వేల ఆర్థిక సాయం



రమ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: మహారాజ బ్యాంకు చైర్మన్, క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కె.రమ్య అనే క్రీడాకారిణికి రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. నగరంలో ఓ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న రమ్య ఇటీవల గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ వెయిల్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. 53 కేజీల విభాగంలో 154 కేజీల ఎత్తి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. రమ్య తల్లిదండ్రులు ఎంవీపీ కాలనీలోని ఓ కల్యాణ మండపంలో వాచ్‌మెన్స్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా వెనుకబడిన రమ్యను ప్రోత్సహించేందుకు సంఘంతో పాటు బ్యాంకు చైర్మన్ సంయుక్తంగా రూ.25 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ ఎంఆర్‌కే రాజు , క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఆరిలోవ: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం తోటగరువు దరి ఎర్నిదుర్గమాంబ ఆలయం ఆవరణలో దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్విక్‌న్ అసోసియేషన్ ప్రతినిధులు అవసరమైన దివ్యాంగులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న విశా సమాచారం దినపత్రిక ఎడిటర్ వీరభద్రరావు మాట్లాడుతూ దివ్యాంగులు నిరాశ చెందకుండా ఉండాలన్నారు. ఎంతో మంది దివ్యాంగులు ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.బి.ఎస్ మూర్తి, డాక్టర్ బీవీకే రాజు, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

బీచ్‌రోడ్డు: చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ అత్యాధిక స్థానాల్లో గెలుపొందడంతో నగరంలోని బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు వైఎంసీఏ వద్ద నాయకులు స్వీట్లు పంచుకొని విజయోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్ రాజు, ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : పాతనగరంలో గల గీతా ప్రచార సమితి కార్యాలయంలో గీతా జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు ఆదివారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు పఠించడం వల్ల మానసిక వికాసం కలుగుతుందన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ద్వారా అందించిన సందేశాన్ని ఆచరించి జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలన్నారు. పోటీలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పలువురు సంస్కృత పండితులు వ్యవహరించారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పి. జగన్మోహనరావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తురాలికి పింఛన్ మంజూరు



అనుపమకు కొత్త పింఛను రూ.10 వేలు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి శివాజీనగర్–2లో సిరిపురపు అనుపమ కొంత కాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఆమె ఇటీవల పింఛను కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకొన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి ఆమెకు పింఛను మంజూరు చేసింది. ఆదివారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సచివాలయం సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అనుపమ ఇంటికి వెళ్లి కొత్తగా మంజూరైన పింఛను రూ.10 వేలు అందజేశారు. ఈ డబ్బులు వ్యాధి నివారణకు వినియోగించుకోవాలని సూచించారు. దీంతో అనుపమ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీరు, సచివాలయ కన్వీనర్లు వీర్రాజు, దుర్గారావు పాల్గొన్నారు.

తోపుడుబళ్ల వ్యాపారులకు రక్షణ కల్పించాలి



సమస్యలు వివరిస్తున్న తోపుడుబండ్ల వ్యాపారులు

మద్దిలపాలెం : తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, తమ ఉపాధికి రక్షణ కల్పించాలని కొటాక్ స్కూల్ ప్రాంత తోపుడు బండ్ల వ్యాపారుల గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు అన్నారు. తోపుడుబండ్ల సమస్యలపై పిఠాపురంకాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంల నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ 21వ వార్డు పరిధిలోని రైల్వే గెస్ట్ హౌస్, కొటాక్ స్కూల్ ప్రాంతంలో 23 మంది తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. జీవీఎంసీ అధికారులు, పోలీసులు నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీంతో ఉపాధికి రక్షణ లేకుండాపోయిందన్నారు. ప్రత్యేక హ్యాకర్ జోన్‌గా ఏర్పాటు చేసి ఉపాధి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ఘనంగా అంబలం పూజ



అంబలం పూజ చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: అయ్యప్ప స్వామి అంబలం పూజా మహోత్సవాన్ని పాత వెంకోజీపాలెంలోని కనకమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాధా కృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజామహోత్సవంలో భాగంగా పంచామృత అభిషేకాలు, భక్తి పాటలతో అయ్యప్పస్వాములు భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. తొలుత అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి పుర వీధులలో సాము గారడీ, సన్నాయి మేళాలతో భారీగా ఊరేగించారు. స్వాములంతా శరణం అయ్యప్ప అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం అంబలం పూజలో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాల చేశారు. ప్రతి ఏడాది అంబలం పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. సుమారు 500 మంది అయ్యప్పస్వాములు హాజరయ్యారన్నారు. సంఘం అధ్యక్షుడు జోగా సూకరాజు, పల్లా శ్రీను, నమ్మి చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

17న దివంగత నటుడు శోభన్‌బాబు విగ్రహావిష్కరణ



ఆహ్వానపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : అందాల కథానాయకుడు శోభన్ బాబు కాంస్య విగ్రహం ఈ నెల 17న ఆవిష్కరించనున్నట్టు విగ్రహ నిర్మాణ కమిటీ నిర్వాహకులు, శోభన్‌బాబు పర్సనల్ మేనేజర్ ఎస్ఎన్ రావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోగ్గాడిగా అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రముఖ సినీ హీరో శోభన్‌బాబును స్మరించుకుంటూ నగరంలోని డాబాగార్డెన్స్ జంక్షన్‌లో ఈ నెల 17న కాంస్య విగ్రహం ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి తదితరుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శోభన్‌బాబు అభిమానులు, కమిటీ సభ్యులు కె. కనకరాజు, దసపల్లా హోటల్ మేనేజర్ బెహరా ప్రసాద్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, గువ్వల రమణ, జె. త్రిమూర్తులు, కె. శోభన్‌బాబు, ఆడిన నాగరాజు, బి. కుమార్, ఓటీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల్లో అప్రమత్తంగా ఉండాలి

విశాఖ విద్య: తుపాను ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలోని జూనియర్ కాలేజీల నిర్వాహకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీవీఈవో బి.రాధ ఒక ప్రకటనలో సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులను కూర్చోబెట్టకూడదని, లీకేజీలు ఉన్న గదుల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. నాడు–నేడు పనులు జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెటీరియల్ పాడవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దివ్యాంగుల సేవే మాధవసేవ

మహారాణిపేట : దివ్యాంగుల సేవే మాధవసేవ అని రామకృష్ణ మిషన్ కార్యదర్శి విద్యానందీశ్వర స్వామి అన్నారు. ఆదివారం ఆలీమ్ కో దివ్యాంగ బాలలకు ఉపకరణాలు అందించేందుకు నిర్వహించిన గుర్తింపు శిబిరంలో ఆయన మాట్లాడారు. సెరిబ్రల్ పాలసీ క్లినిక్‌లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యానందీశ్వర స్వామి చిన్నారులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జీవీఎంసీ జోన్–4 జెడ్సీ శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విశిష్ట అతిథి, బీజేపీ నాయకుడు ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నరేంద్రప్రకాష్, జీవీఎంసీ ఏపీడీ పుణ్యవతి, కార్యక్రమ కోఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ఆలీమ్ కో ప్రతినిధులు డాక్టర్ శ్వేత, సుమారు 250 మందికి పైగా దివ్యాంగ బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

11,12 తేదీల్లో ధర్నా

దాబాగార్డెన్స్ : ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద మహా ధర్నాలు నిర్వహించనున్నట్టు ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. మహాధర్నాలు విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో ఆశ కార్యకర్తల విశాఖ జిల్లా కమిటీ సమావేశమైంది.

‘ఒంటి కాలు పరుగు’ పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

మహారాణిపేట : తెలుగు భాష, సాహిత్యాలను పరిపుష్టం చేస్తూ రచనలు చేసిన ఘనత డాక్టర్ బండి సత్యనారాయణ సొంతమని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఆదివారం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన ఒంటి కాలు పరుగు కవిత్వ సంపుటిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ గొప్ప రచనలు చేశారన్నారు. సామాజిక స్పృహతో మానవీయ కోణంలో ఆయన రచనలు ఉంటాయన్నారు. స్త్రీవాదాన్ని సమర్థిస్తూ కవితలు రాశారని అన్నారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్తగా కవితలు రాసే వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి కార్యక్రమాల విభాగాధిపతి బేతా రామ సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సందడి



సమావేశమైన పూర్వవిద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ఇంజినీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కాకినాడ (జేఎన్‌టీయూ) పూర్వవిద్యార్థుల సమావేశం ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 1982 బ్యాంచ్‌కు చెందిన విద్యార్థులు భారీగా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ 1982 నుంచి ఏటా డిసెంబర్ తొలి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 42వ ఏడాది నిర్విరామంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. స్నేహితులతో ఆనందంగా గడిపారు. అనంతరం జేఎన్‌టీయూ కాకినాడ వీసీ జీవీఎస్ ప్రసాదరాజును సత్కరించారు.

ప్రముఖ రచయిత బాబ్జీకి అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డు



వైఎస్సార్ సీపీ నేత మల్లాది విష్ణు చేతులు మీదుగా అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డు స్వీకరిస్తున్న రచయిత బాబ్జీ

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ రచయిత, నటుడు డాక్టర్ బాబ్జీకి అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ 92వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో నగరానికి చెందిన రచయిత, నటుడు, విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ కార్యదర్శి బి.ఆంజనేయులు, ఎ.ఎస్.శ్రీనివాసరాజు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పీవీ విజయబాబులు పాల్గొన్నారు. తనకు ఇంటి గొప్ప అవార్డును అందించి సత్కరించిన నిర్వాహకులు ఆయన కృతజ్ఞతులు తెలిపారు. తనకు ఇది 50వ అవార్డు అన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు, సాహితీవేత్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో నగర ప్రజలు అర్జీలు పెట్టుకోవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.